క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కొత్తూరు: కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ సాయికృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 33కేవీ సబ్‌స్టేషన్‌లో విద్యుత్‌లైన్ మరమ్మతుల కారణంగా అంతరాయం ఉంటుందని తెలిపారు. ప్రజలు, వ్యాపారులు విద్యుత్ సరఫరాలో అంతరాయానికి సహకరించాలని కోరారు.

కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించండి

పీసీసీ సభ్యుడు మహ్మద్‌అలీఖాన్‌బాబర్

షాద్‌నగర్‌రూరల్: మున్సిపల్ పరిధిలో అభివృద్ధి పనులు చేసిన కాంట్రాక్టర్లకు పెండింగ్ బిల్లులను సకాలంలో చెల్లించాలని పీసీసీ సభ్యుడు, మాజీ ఉపసర్పంచ్ మహ్మద్‌అలీఖాన్‌బాబర్ డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపులో‌అలసత్వంపై శనివారం మున్సిపల్ ఏఈ నర్సింలుకు ఆయన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహ్మద్‌అలీఖాన్‌బాబర్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో టెండర్లద్వారా పూర్తి చేసిన పనులకు కాంట్రాక్టర్లకు ఇస్తున్న చెక్కులు సంవత్సరాలు గడుస్తున్నా పాస్ కావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ బిల్లుల చెల్లింపులో ఆలస్యం చేస్తున్నారని మున్సిపల్ అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేదని ఆయన వాపోయారు. మున్సిపల్ అధికారులు సకాలంలో బిల్లులు చెల్లించడంలేదని దీంతో వారు పనులు చేసేందుకు ముందుకు రావడంలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కాంట్రాక్టర్లకు సత్వరమే పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని ఆయన కోరారు.

మహిళా బిల్లు అగ్రవర్ణాలకే అనుకూలం

ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షుడు రాకేశ్



రాస్తారోకో నిర్వహిస్తున్న డీఎస్పీ నాయకులు

కేశంపేట: బీజేపీ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన మహిళ బిల్లు అగ్రవర్ణ మహిళలకే అనుకూలంగా ఉందని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాకేశ్ పేర్కొన్నారు. మహిళా బిల్లును వ్యతిరేకిస్తూ మండల కేంద్రంలో ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించి, దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా రాకేశ్ మాట్లాడుతూ మహిళ రిజర్వేషన్ బిల్లుతో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ఎలాంటి ఉపయోగం లేదన్నారు. బిల్లులో ఉప కులాల కోటా కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహిపాల్, కృష్ణ, రవి, శ్రీకాంత్, నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

జీవన ఎరువులతో నేలలు సారవంతం

వ్యవసాయ శాస్త్రవేత్త నరేందర్‌రెడ్డి



పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

కొత్తూరు: రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి జీవన ఎరువుల వినియోగాన్ని పెంచితే నేలలు మరింత సారవంతంగా మారుతాయని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం అసోసియేట్ డీన్ నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని మల్లాపూర్‌లో పలువురు రైతులు సాగు చేసిన పంటలను ఆయనతో పాటు మరికొంత మంది శాస్త్రవేత్తలు పరిశీలించారు. అనంతరం వారు రైతులకు పంటల సాగులో పలు సూచనలు, సలహాలు తెలియజేశారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను సాగుచేస్తే లాభాలు ఎక్కువగా ఉంటాయన్నారు. ముఖ్యంగా రైతులు పంటల సాగుపై పూర్తిస్థాయి అవగాహన పెంచుకోవాలన్నారు. తక్కువ ఖర్చుతో అధిక లాభాలు వచ్చే పంటలు, మార్కెటింగ్ సదుపాయాలపై సంబంధిత వ్యవసాయ అధికారులతో వివరాలు తెలుసుకోవాలని కోరారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు రమేష్, వెంకటేశ్వర్‌రెడ్డి, శైలజ, శకుంతల దేవి పాల్గొన్నారు.

హాజిపల్లిని సందర్శించిన విద్యార్థులు

షాద్‌నగర్: నిర్మల్ పురస్కార్ అవార్డు పొందిన హాజిపల్లి గ్రామాన్ని శనివారం షాద్‌నగర్ పట్టణ శివారులోని హెరిటేజ్‌వ్యాలీ పాఠశాల విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో చేపట్టిన అభివృద్ధిని పురవీధుల గుండా పర్యటించి విద్యార్థులు పరిశీలించారు. గ్రామంలో పరిశుభ్రత ఏవిధంగా చేపడుతున్నారన్న విషయాలను సర్పంచ్ ఇస్నాతి మౌనిక విద్యార్థులకు వివరించారు. గ్రామంలోని పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. అనంతరం సర్పంచ్ మౌనిక మాట్లాడుతూ... గ్రామాభివృద్ధిలో యువత, విద్యార్థుల పాత్ర ఎంతో కీలకమన్నారు. దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని చెప్పారు. విద్యార్థులు చదువుల్లో రాణించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు.

పత్తి, వరికి తెగుళ్ల బెడద



- నివారణ చర్యలు చేపడితే మేలు
- యాజమాన్య పద్ధతులు తప్పనిసరి
- జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి



షాబాద్: రంగారెడ్డి జిల్లాలో విస్తారంగా సాగు చేస్తున్న పత్తి, వరిని వివిధ తెగుళ్లు ఆశిస్తున్నాయి. తగిన యాజమాన్య పద్ధతులు పాటించకుంటే ముప్పుతప్పదని వ్యవసాయ అధికారులు హెచ్చరిస్తున్నారు. వరి, పత్తిలో తెగుళ్లు కనిపిస్తే వెంటనే నివారణ చర్యలు చేపట్టి పంటలను కాపాడుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి రైతులకు సూచించారు. ప్రస్తుతం వరి, పత్తిని ఆశించే తెగుళ్లు, వాటి నివారణ చర్యల గురించి ఆమె వివరించారు.

వరిలో తెగుళ్లు...

ప్రస్తుతం వరికి తెగుళ్లు సోకే పరిస్థితులున్నాయి. ముఖ్యంగా అగ్గి తెగుళ్లు ఆశించే ప్రమాదముంది. రైతులు ఈ తెగుళ్లను గమనిస్తే వెంటనే నివారణ చర్యలు చేపట్టాలి. ట్రై సైక్లోజోల్ 0.5 గ్రాము లేదా ఇసోప్రొథైయోలిన్ 0.5 మి.లీ లేదా కాసుగా మైసిన్ 2.5 మిల్లీ లీటర్‌ను లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలి. పిలకలు లేదా దుబ్బు చేసే దశలో ఉన్న వరి పంటలో కాండం తొలిచే పురుగు ఆశించే ప్రమాదముంది. దీని నివారణకు 10 కిలోల కిర్బోఫ్యూరాన్ 3జీ గుళికలు లేదా 4 కిలోల క్లోరాంట్రినిలిప్రోల్ 0.4 జీ గుళికలను వేసుకోవాలి. వరిని బ్యాక్టీరియా ఎండు ఆకు తెగులు కూడా ఆశించే అవకాశముంది. దీని నివారణకు 30 గ్రాముల కాపర్, ఆక్సిక్లోరైడ్ 2 గ్రాముల ప్లాంటోమైసిన్ మందును లీటర్ నీటిలో కలిపి వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేసుకోవాలి. అలాగే వరిని ఉల్లి కోడు ఆశిస్తే పురుగు ఉధృతిని ఎప్పటికప్పుడు గమనించాలి. ఇప్పటికే అక్కడక్కడా తాటాకు తెగుళ్లు కనిపిస్తోంది. దీని నివారణకు 2మి.లీ ప్రొఫెనో ఫాస్ లేదా 2.5 మి.లీ క్లోరిఫైరిపాస్ మందును లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలి. అక్కడక్కడా ఆకు ముడత కూడా కనిపిస్తోంది. దీని నివారణకు 2 గ్రాముల కార్టాప్ హైడ్రోక్లోరైడ్ లేదా 0.4 మి.లీ క్లోరాంట్రినిలిప్రోల్ మందును లీటర్ నీటిలో కలిపి పంటపై పిచికారి చేసుకోవాలి.

నరెడ్లగూడలో వరి

పత్తిలో తెగుళ్లు, నివారణ చర్యలు..

ప్రస్తుతం పత్తి పంటలో పేనుబంక ప్రభావం కనిపిస్తోంది. దీని నివారణకు 5.మి.లీ వేపనూనే, 0.25 మి.లీ ఇమిడాక్లోప్రిడ్ మందును లీటర్ నీటిలో కలిపి పంటపై పిచికారి చేసుకోవాలి. తామర పురుగు, పచ్చదోమ ఆశిస్తే 2 మి.లీ ఫిప్రోనిల్ లేదా 0.3 గ్రాముల ఫ్లోనికామిడ్ లేదా 0.75 మి.లీ సల్ఫాక్సాఫ్లోర్ మందును లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలి. పండాకు తెగులు ఆశిస్తే మెగ్నిషియం ధాతు లోపం నివారణకు 10 గ్రాముల మెగ్నిషియం సల్ఫేట్‌ను లీటర్ నీటిలో కలిపి పంటపై పిచికారి చేయాలి. బ్యాక్టీరియా ఆకుమచ్చ తెగులు నివారణకు 3 గ్రాముల కాపర్ ఆక్సిక్లోరైడ్ లేదా ఒక గ్రాము కిర్బండిజమ్ మందును లీటర్ నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి. పత్తిలో అక్కడక్కడా గులాబీ రంగు పురుగు ప్రభావం ఉన్నట్లు తెలుస్తోంది. దీని ఉనికిని గమనించడానికి ఎకరాకు 4 లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకుని వరుసగా 3 రోజులు 7–8 తల్లిరెక్కల పురుగులు గమనిస్తే సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. నివారణకు 1.5 గ్రాముల థయోడికార్బ్ లేదా 2 మి.లీ క్లోరిఫైరిఫాస్ మందును లీటర్ నీటిలో కలిపి పంటపై పిచికారి చేయాలని జిల్లా వైద్యాధికారి గీతారెడ్డి సూచించారు.



బొబ్బిలిగామలో సాగు చేసిన పత్తి పంట

బీఆర్‌ఎస్‌కు మెజార్టీ ఖాయం

ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

కొత్తూరు: రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ భారీ మెజార్టీ సాధిస్తుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. మండలంలోని సిద్ధాపూర్, చింతగట్టుతండాలకు చెందిన ఆయా పార్టీల నాయకులు శనివారం ఆయన సమక్షంలో పార్టీలో చేరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం కేసీఆర్ అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు వివరించారు. వ్యవసాయానికి అండగా ఉండాలనే లక్ష్యంతో వేల కోట్లతో సాగునీటి ప్రాజెక్టులు నిర్మించినట్లు చెప్పారు. వ్యవసాయంలో లాభాలు గడించేలా రైతులకు వ్యవసాయ అధికారులు పంటల సాగుపై అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉద్యోగాల కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఆయా శాఖల్లో నోటిఫికేషన్లు జారీ చేసి భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. అర్హులకు పెన్షన్లు, డబుల్‌బెడ్రూం ఇళ్ల పంపిణీ చేసిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కిందన్నారు. మహిళలు ఆర్థికంగా రాణించడంతో భాగంగా వారికి అధిక మొత్తంలో రుణాలు మంజూరు చేస్తు వారిని ప్రోత్సహిస్తున్నట్లు వివరించారు. రాష్ట్రంలో చేసిన అభివృద్ధి పనులే బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మె సత్యనారాయణ, మెండె కృష్ణ, బాలయ్య, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరుతున్న వారికి కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

కురుమలు అన్ని రంగాల్లో రాణించాలి

సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింహులు, మండల అధ్యక్షుడు పాండు

షాబాద్: కురుమలు రాజకీయంగా, ఆర్థికంగా అన్ని రంగాల్లో రాణించాలని కురుమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాపోల్ నర్సింహులు, మండల అధ్యక్షుడు మద్దూరు పాండు పేర్కొన్నారు. శనివారం షాబాద్ మండల పరిధిలోని నాందార్‌ఖాన్‌పేట్ గ్రామంలో సమావేశం నిర్వహించారు. అనంతరం నూతన కార్యవర్గం ఎనుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కురుమలు రాజకీయంగా, సామాజికంగా అన్ని రంగాల్లో ఎదగాలన్నారు. ఐక్యంగా ఉండి హక్కులు, రాజ్యాధికారం సాధించుకోవాలన్నారు. మండంలోని అన్ని గ్రామాల్లో సంఘం కమిటీలు ఏర్పాటు చేసుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు క్యామ నారాయణ, కార్యదర్శి కేసారం కృష్ణ, సలహాదారుడు బర్క నరేందర్, యూత్ అధ్యక్షుడు మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

నాంధార్‌ఖాన్‌పేట్ నూతన కార్యవర్గం..

నాంధార్‌ఖాన్‌పేట్ అధ్యక్షుడిగా బింగి శేఖర్, ఉపాధ్యక్షుడిగా మేకల కృష్ణ, మచందర్, ప్రధాన కార్యదర్శిగా రాఘవేందర్, సలహాదారుడిగా మేకల పెంటయ్య, అంజయ్య ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

క్రీడలతో మానసిక ఆరోగ్యం

రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం ఉపాధ్యక్షురాలు మంజుల



మొయినాబాద్‌రూరల్: ఫుట్‌బాల్ శిక్షణను ప్రారంభిస్తున్న మంజుల

మొయినాబాద్‌రూరల్: క్రీడలతో మానసిక ఆరోగ్యం చేకూరుతుందని రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం ఉపాధ్యక్షురాలు మంజులరవియాదవ్ అన్నారు. హిమాయత్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో మార్స్ ఫుట్ బాల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫుట్‌బాల్ పోటీలను ప్రారంభించారు. 3, 4, 5 తరగతి విద్యార్థులకు వారానికి ఒకసారి శిక్షణ ఇవ్వనున్నట్లు ఫౌండేషన్ వారు సూచించారు. శనివారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమాన్ని మంజుల రవియాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు మార్స్ ఫుట్ బాల్ ఫౌండేషన్ వారు ఉచితంగా చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాములు, మల్లేశ్‌యాదవ్, భాస్కరచారి, రమేష్‌యాదవ్, సతీష్‌గౌడ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి శుభాకాంక్షల వెల్లువ

రాష్ట్ర గనులు, భూగర్భవనరుల శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా శనివారం నగరంలోని ఆయన నివాసంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పుష్పగుచ్ఛం, శాలువా కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



చేవెళ్ల: శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు



షాబాద్: మంత్రి మహేందర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న జిల్లా లీగల్ అడ్వైజర్ సతీశ్‌రెడ్డి



శంకర్‌పల్లి: మంత్రికి గజమాల వేసి శుభాకాంక్షలు తెలిపిన బీఆర్‌ఎస్ నాయకులు

అంగన్‌వాడీలపై నిర్లక్ష్యం తగదు



షాద్‌నగర్: సమ్మె శిబిరంలో మాట్లాడుతున్న శ్రీవర్ధన్‌రెడ్డి



కేశంపేట: అంగన్‌వాడీలకు సంఘీభావం తెలుపుతున్న రాజు

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్: అంగన్‌వాడీల డిమాండ్‌లను నెరవేర్చడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు చేపడుతున్న నిరవధిక సమ్మె శనివారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా శ్రీవర్ధన్‌రెడ్డి సమ్మె శిబిరానికి వెళ్లి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎన్ రాజు, చెట్ల వెంకటేశ్, మురళీ, శ్రీను నాయక్, ఈశ్వర్‌నాయక్, అంగన్‌వాడీ సంఘం నాయకులు శ్రీదేవి, మమత, జయ పాల్గొన్నారు.

కేశంపేటలో..

కేశంపేట: అంగన్‌వాడీ టీచర్ల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు అన్నారు. జయమ్మ, రంగమ్మ, స్వప్న, సుమల్య, శశికళ తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత..

తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలని కోరతూ తహసీల్దార్ అజీంఅలీకి సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలు వినతి పత్రం అందజేశారు.



మొయినాబాద్: మాట్లాడుతున్న షాబాద్ దర్శన్

మొయినాబాద్:

అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షాబాద్ దర్శన్ డిమాండ్ చేశారు. మొయినాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలకు మద్దతు తెలిపారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాణయ్య, కేబుల్ రాజు, తదితరులు ఉపాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి..

అంగన్‌వాడీలు తహసీల్దార్ గౌతంకు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్, ఉమ, ప్రవీణ, తదితరులు పాల్గొన్నారు.



కొందుర్గులో నిమ్మరసం ఇచ్చి సమ్మె విరమింపజేస్తున్న నాయకులు

కొందుర్గులో..

కొందుర్గు: 13 రోజులుగా సమ్మెచేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చీమ కుట్టినట్లు లేదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య, సీఐటీయూ మండల కార్యదర్శి రాయికంటి గోపాల్ విమర్శించారు. కొందుర్గు అంగన్‌వాడీ కార్యకర్తలకు నిమ్మరసం ఇచ్చి సమ్మె విరమింపజేశారు. నరసింహాదాసు, శారద, అరుణ, వినోద, పాల్గొన్నారు.

పూజలందుకుంటున్న గణనాథులు

చేవెళ్ల: నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పూజలు కొనసాగుతున్నాయి. రచ్చబండ వద్ద చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బీజేపీ నియోజకవర్గం నాయకులు తులసీరామ్‌విజయ్‌కుమార్ పూజలు చేశారు. మల్లికార్జున కాలనీ, రజకనగర్ కాలనీ, అంబేద్కర్ కాలనీ, హౌసింగ్‌బోర్డు కాలనీలలో నిర్వహించిన అన్నదానంలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పాల్గొన్నారు. సర్పంచ్ శైలజ ఆగిరెడ్డి, తదితరులు పూజలు చేశారు.

శంకర్‌పల్లిలో..

శంకర్‌పల్లి: శంకర్‌పల్లి మండలంలోని మహాలింగపురం గ్రామంలో శివాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద శనివారం శంకర్‌పల్లి పీఏసీఎస్ డైరెక్టర్ కే. రాజశేఖర్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మొయినాబాద్ రూరల్‌లో..

మొయినాబాద్‌రూరల్: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 6వ రోజు పూజలు నిర్వహించారు. అన్నదానం ఏర్పాటు చేశారు. హిమాయత్‌నగర్, అమ్డాపూర్, బాకారం, అజీజ్‌నగర్, కనకమామిడి, ఎన్కెపల్లి, ముర్తుజాగూడలో పూజలు జరుగుతున్నాయి. అమ్డాపూర్‌లో బీఆర్‌ఎస్ నాయకుడు గోపి కృష్ణారెడ్డి, భాను చందర్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.



కొందుర్గు: రేగడిచిల్కమర్రిలో వీర్లపల్లి శంకర్

కొందుర్గులో..

కొందుర్గు: భక్తి భావం పెంపొందించుకోవాలని పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ అన్నారు. రేగడిచిల్కమర్రిలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ రవికుమార్ గుప్తా, జితేందర్ రెడ్డి పాల్గొన్నారు. కొందుర్గు శ్రీలక్ష్మినరసింహ్మాస్వామి దేవాలయ ప్రాంగణంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో స్త్రీకంఠ గాయకులు డాక్టర్ దీక్షితుల సుబ్రహ్మణ్యం హాజరయ్యారు.

షాద్‌నగర్‌రూరల్: ఎలికట్ట గ్రామంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో గ్రంథాలయ కమిటీ డైరెక్టర్ ఆర్లయాదయ్యయాదవ్ పూజలు నిర్వహించారు.



చేవెళ్ల: పూజలో మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, తులసీరామ్ విజయ్‌కుమార్



షాద్‌నగర్ రూరల్: ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఆర్లయాదయ్య యాదవ్



శంకర్‌పల్లి: పూజలో పీఏసీఎస్ డైరెక్టర్ రాజశేఖర్‌రెడ్డి

స్వచ్ఛమైన నీటి సరఫరాయే లక్ష్యం

చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్: తండాల్లో స్వచ్ఛమైన నీటి సరఫరా చేయడమే లక్ష్యమని పాలమూరు చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని సాయిబాలాజీ టౌన్ షిప్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో 300 జనాభా ఉన్న తండాల్లో ట్రస్టు ఆధ్వర్యంలో శ్రీశ్రీశ్రీ సంత్ సేవాలాల్ సుజల కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా తండాల్లో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. నియోజకవర్గంలో 50 తండాల్లో ఒక్కో ప్లాంట్‌ను రూ.3.50లక్షల వ్యయంతో ఏర్పాటు చేస్తామన్నారు. తండాల్లో ప్లాంట్ల ఏర్పాటునకు స్థలం చూపించాలని గిరిజనులను ఆయన కోరారు. ఈ సమావేశంలో అమడాపురం నర్సింహ్మ, ఇస్నాతి శ్రీనివాస్, సుధాకర్, మోహన్‌సింగ్, లష్కర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విష్ణువర్ధన్‌రెడ్డి

జిల్లా స్థాయిలో విద్యార్థుల ప్రతిభ



బహుమతులు అందజేస్తున్న డాక్టర్ రాఘవరెడ్డి

షాద్‌నగర్‌రూరల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో శనివారం షాద్‌నగర్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. డివిజన్ స్థాయిలో గెలుపొంది జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కొండాపూర్‌లో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో అండర్ 17, 14 విభాగంలో బాల, బాలికలు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానంలో నిలిచారు. గెలిచిన విద్యార్థులకు ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాఘవరెడ్డి హాజరై బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల్లో ఎంతో ప్రతిభ దాగి ఉంటుందన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు పీఈటీలు కృషి చేయాలని సూచించారు.